క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మంగంపల్లిలో వివిధ పార్టీలకు చెందిన 25కుటుంబాల వారు హైదరాబాద్‌లోని మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. వారికి మంత్రి బీఆర్‌ఎస్‌ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల వారు ఆకర్షితులై పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి దేశానికే ఆదర్శంగా ఉందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

రోడ్డు పూర్తి చేయాలని వినతి



శ్రీరంగాపురం: మండలంలోని నాగసానిపల్లె నుంచి మండల కేంద్రానికి ఐదు కిలో దూరం ఉంది. గతంలో మూడున్నర కిలోమీటర్లు బీటీ రోడ్డు వేసేందుకు రూ.3కోట్లు మంజూరు కాగా ఆ పనులు వేగవంతంగా నడుస్తున్నాయి. మిగతా 1.5కిలోమీటర్‌కు కూడా నిధులు మంజూరు చేసి మిగిలిన రోడ్డును పూర్తి చేయాలంటూ గురువారం జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌ యాదవ్, నాగసానిపల్లె గ్రామస్తులు పంచాయతీరాజ్‌ ఈఈ మల్లయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఈశ్వరయ్య, భీముడు, కుర్మన్న, గోవింద్, పురుషోత్తం, నవీన్, బి.విష్ణు ఉన్నారు.

తక్కువ బరువున్న పిల్లలపై శ్రద్ధ



వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పసిపిల్లల్లో బరువు తక్కువ ఉన్న వారిని గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, చంద్రకళ, కృష్ణవేణి, కృష్ణమ్మ, మాధవి అన్నారు. గురువారం వారివారి అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించామని తెలియజేశారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు, చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మధుకు పరామర్శ

వనపర్తి టౌన్: ఇటీవల జరిగిన రాష్ట్ర సీఎం కప్‌ క్రీడల పోటీల్లో పాల్గొని గాయపడ్డ అథ్లెటిక్‌ మధును గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ శ్రీధర్‌ పరామర్శించారు. మధుకు కాలు ప్రాక్చర్‌ కావడంతో ఆపరేషన్‌ చేసి రాడ్‌ వేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మధుకు శ్రీధర్, 6వ వార్డు కౌన్సిలర్‌తో కలిసి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ముగిసిన వేసవి అథ్లెటిక్స్‌ శిక్షణ శిబిరం



ఖిల్లాఘనపురం: మండలంలో మే 1వ తేదీన ప్రారంభించిన వేసవి అథ్లెటిక్స్‌ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. చివరి రోజున క్రీడాకారులను కోచ్‌లు దేవేందర్, పర్వతాలు మహ్మదుస్సేన్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న పెద్ద వాగుకు తీసుకెళ్లి ప్రత్యేకంగా వ్యాయామం చేయించడంతో పాటు రన్నింగ్, లాంగ్‌ జంప్‌ తదితర క్రీడల్లో పాటించవలిసిన మెలుకువలను నేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ శిబిరానికి మొత్తం 60 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు.

వరిధాన్యం కొనుగోలుకు పడిగాపులు

పెద్దకొత్తపల్లి: యాసంగిలో పండించిన వరిధాన్యాన్ని అమ్ముకోవడం కోసం రైతులు కల్లాల్లో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోకపోవడంతో కాంటా అయినా కూడా కొనుగోలు కేంద్రాల వద్దనే ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దకొత్తపల్లి సింగిల్‌విండో పరిధిలో 10 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 100 లారీలను రైతుల నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్లారు. మరో 20 లారీల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే ఉన్నాయి. కొత్తపేట సింగిల్‌విండో పరిధిలో 8 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 20 లారీల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

ఈదురు గాలులతో తీవ్ర నష్టం

- పలు గ్రామాల్లో ఇంటి పై కప్పు రేకులు ధ్వంసం
- రహదారులపై విరిగిపడ్డ చెట్లు, విద్యుత్‌ స్తంభాలు
- విద్యుత్‌ సరఫరాలో అంతరాయం



గోవర్ధనగిరి సమీపంలో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు అన్నారం, కేతేపల్లి, దావాజిపల్లి, కదిరెపాడు, వెంగళాయిపల్లి గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు కదిరెపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వీరపాగ రాములు ఇంటి పై కప్పు రేకులు ధ్వంసమై పూర్తిగా కిందపడిపోయినట్లు బాధితుడు వాపోయారు. దీంతో పాటు కాలనీలో రెండు విద్యుత్‌ స్తంభాలు విరిగిపోయాయని కాలనీవాసులు తెలిపారు. వెంగళాయిపల్లిలో రోషన్‌బీ అనే మహిళకు చెందిన ఇంటి పై కప్పు రేకులు ధ్వంసం కావడంతో పాటు ఇంటి ఆవరణలో ఉన్న ఉన్న చెట్లు విరిగిపడ్డాయి. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కోరుకుంటున్నాయి. కదిరెపాడులో విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించాలని ఎంపీటీసీ సభ్యురాలు నాగమ్మ అధికారులను కోరారు.

దావాజిపల్లిలో పిడుగుపాటు

మండలంలోని దావాజిపల్లిలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ సమయంలో ఇంటిపై ఆరవేసిన బట్టలను తీసుకురావడానికి ఇంటిపైకి వెళ్లిన వివాహిత మహిళ లలిత భారీ శబ్దంతో పిడుగుపాటు మెరుపులకు షాక్‌ గురై దాబాపై పడిపోయి స్పృహ కోల్పోయింది. దీంతో వెంటనే గమనించిన కుటంబ సభ్యులు జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.



కదిరెపాడులో కూలిన రేకులు

వాహనదారుల ఇబ్బందులు

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం పెద్ద ఎత్తున ఈదురు గాలులు రావడంతో రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. గోవర్ధనగిరి, వెలగొండ గ్రామాలతో పాటు అమ్మాయిపల్లి రోడ్డు మార్గంలో పెద్ద పెద్ద చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదాలు జరగకపోవండతో ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



వెంగళాయిపల్లిలో కూలిన రేకులు

బొడ్రాళ్ల పునఃప్రతిష్ఠాపన పూజలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో రైతు కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా బొడ్రాళ్ల పునఃప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ నిర్మాణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపడింతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ప్రధాన రహదారులపై బొడ్రాళ్ల విగ్రహాలు, శివాలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వివిధ ప్రజాప్రతినిధులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులకు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఎంపీపీ గాయత్రి, సర్పంచ్‌ మంజుల, ఎంపీటీసీ ఎల్లస్వామి, పెబ్బేరు సింగిల్‌ విండో అధ్యక్షుడు కోదండ రామిరెడ్డి, గౌడ్‌నాయక్, ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, నాయకులు బుచ్చారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శివాలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న భక్తులు

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని మండల ముదిరాజ్‌ సంఘం నాయకులు గురువారం ఖిల్లాఘనపురం సర్పంచ్‌ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రవితేజకు వినతిపత్రం ఇచ్చారు. మండల కేంద్రంలోని రైతువేదిక సమీపంలో గురువారం మండల స్థాయి ముదిరాజ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 14 గ్రామాల నుంచి ముదిరాజ్‌లు పెద్ద సంఖ్యలో తలివచ్చారు. మండల కేంద్రంలో త్వరలో నిర్వహించే ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం, పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలపై చర్చించారు. ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమను రాజకీయ పార్టీల కేవలం ఓటు బ్యాంక్‌ గా వాడుకొని ఎన్నికల తర్వాత తమ సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీనివాసులు, రాంచెంద్రి, చెన్నయ్య, గోపి, దేవేందర్, వెంకటయ్య, మల్లేష్, రాములు, లక్ష్మయ్య, కుర్మయ్య, రాఘవేందర్, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్‌ సంఘం సభ్యులు

ఆలయ ముఖద్వారానికి భూమిపూజ

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో కురుమూర్తి స్వామి ఆలయ ముఖద్వారాన్ని గ్రామానికి చెందిన సతీష్‌కుమార్‌ దంపతులు సొంత ఖర్చులతో నిర్మించేందుకు గురువారం వేదపండితులు వెంకటేశ్వర చార్యులు ప్రత్యేక పూజ చేసిన అనంతరం భూమిపూజ చేశారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అలంకణోత్సవం కార్యక్రమం అత్యంత కనుల పండగ జరుగుతుంది. స్వామి ఆభరణాలను దుప్పల్లి మీదుగా కురుమూర్తి గిరులకు తరలిస్తారు. ఆభరణాలకు పెద్ద ఎత్తున స్వాగతం పలికి గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. స్వాగతం పలికే స్థలంలో ముఖద్వారం నిర్మించేందుకు దాతలు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో సర్పంచు శివ, వెంకటేశ్వర రెడ్డి, తిర్మల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బత్తుల నరసింహ, నర్సిరెడ్డి, భరత్‌కుమార్, భరత్‌రెడ్డి, అనంత రాములు గౌడ్, వడ్ల సత్యన్న, మహిందర్, రామదాస్‌గౌడ్, గొల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న దాతలు

కుల వృత్తులకు పెద్దపీట

మదనాపురం: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కులవృత్తులకు పెద్ద పీట వేస్తుందని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు బిట్లి యాదగిరి అన్నారు. గురువారం మండలంలోని నర్సింగాపురంలో గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ మొదటి విడత విజయవంతమైందన్నారు. జూన్‌ 5వ తేదీన రెండో విడత ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ కులం సర్టిఫికెట్, ఆధార్‌ కార్డు, బ్యాంకు అకౌంట్‌తో పాటు రూ.34,750 డీడీ చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని కాపరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు బాలరాజుయాదవ్, బండి యాదగిరి, రాములు, వెంకటేష్, సురేష్, బాలీశ్వరయ్య, ఆంజనేయులు, బాలస్వామి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిట్లి యాదగిరి

అధికారమే లక్ష్యంగా ముందుకు

ఆత్మకూర్: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నాయకులు, కార్యకర్తలు అధికారమే లక్ష్యంగా ముదుకెళ్లాలని బీజేపీ మున్సిపల్‌ ఫ్లోర్‌లీడర్‌ అశ్విన్‌కుమార్‌ అన్నారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో మహాజన్‌ సంపర్క్‌ యోజన కార్యాక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కేసీఆర్‌ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని, బీఆర్‌ఎస్‌ వైఫల్యాలను గడపగడపకు తీసుకెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగలింగేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, చందు, సమద్‌ తదితరులు ఉన్నారు.



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పౌష్టికాహారం పంపిణీలో ప్రత్యేక 'ముద్ర'

- అంగన్‌వాడీల్లో ప్రభుత్వ లోగోతో కోడిగుడ్డు
- ఈనెల నుంచి అమలు



కోడిగుడ్డుపై వేసిన ముద్ర



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు (ఫైల్)

పాన్‌గల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం, పూర్వ ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటి ఆధ్వర్యంలో ప్రభుత్వం నెల నెలా కోడిగుడ్లు, ఇతర పౌష్టికాహార సరుకులు పంపిణీ చేస్తోంది. అయితే కొందరు అక్రమార్కుల దాహార్తితో అవి పక్కదారి పడుతున్నాయి. మరోవైపు కుళ్లిన, చిన్న పరిమాణం కలిగిన గుడ్లు సరఫరా చేస్తుండటంతో చెత్త పాలవుతున్నాయి. ఈ క్రమంలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి కోడిగుడ్డుపై 'అంగన్‌వాడీ గుడ్డు' అని రాసి ఉన్న ముద్ర వేస్తున్నారు.

పక్కదారి పడుతున్న సరుకులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామృతం, గుడ్డు, ఆరేళ్ల లోపు వారికి గుడ్డు, పప్పు, కూరగాయాల భోజనం, అల్పాహారం, బలవర్ధకమైన పల్లీ పట్టీలు అందిస్తున్నారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో ప్రతి రోజు 200 మి.లీ పాలు సరఫరా చేస్తున్నారు. బరువు తక్కువగా, బలహీనంగా ఉన్న లబ్ధిదారులకు రెట్టింపు స్థాయి పౌష్టికాహారం పంపిణీ అవుతోంది. అయితే అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండటంతో సిబ్బంది సరకులను పక్కదారి పట్టిస్తున్నారు.

మండల పరిస్థితి....

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో అన్నారం, పాన్‌గల్‌ సెక్టార్ల పరిధిలో కేంద్రాల వివరాలు ఇలా..

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు :	59
మినీ కేంద్రాలు:	03
మూడేళ్ల లోపు చిన్నారులు:	956 మంది
మూడు నుంచి ఆరేళ్ల లోపు :	704 మంది
గర్భిణులు, బాలింతలు:	363 మంది

నెలలో మూడు రంగుల్లో గుడ్లు

కోడిగుడ్ల పంపిణీలో అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తోంది. ఈనెల నుంచి ప్రత్యేకంగా పంపిణీ చేసే కోడిగుడ్లు మూడు రంగుల్లో పంపిణీ చేయనున్నారు. నెలలో పది రోజులకోసారి కోడిగుడ్లపై ప్రత్యేక రంగుతో కూడిన ముద్రను వేస్తోంది. మొదటి విడతలో నీలి, రెండో విడతలో ఎరుపు, మూడో విడతలో ఆకుపచ్చ రంగుల్లో 'అంగన్‌వాడీ గుడ్డు' పంపిణీ చేయనున్నారు. కుళ్లిపోతే సంబంధిత కాంట్రాక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

పర్యవేక్షణ ఉండాలి

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ పెంచాలి. అధికారుల పర్యవేక్షణ లేక కేంద్రాల నిర్వహణ, పౌష్టికాహార పంపిణీ సక్రమంగా లేదు. ప్రత్యేక ముద్రతో పంపిణీ చేసే కోడిగుడ్ల కార్యక్రమం మంచిది. దీంతో సరుకుల అక్రమాలను అరికట్టవచ్చు.

– శాంతమ్మ, సర్పంచ్, తెల్లరాళ్లపల్లితండా

కేంద్రాలు మరింత బలోపేతం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, సరుకుల పంపిణీలో ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విధానాలతో కేంద్రాలు మరింత బలోపేతం అవుతాయి. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సక్రమంగా పంపిణీ చేసేలా నిబంధనాలను పక్కగా అమలు చేస్తూ అధికారుల పర్యవేక్షణ పెంచాలి. కేంద్రాల ద్వారా పంపిణీ చేసే సరుకులు, పౌష్టికాహారంపై గ్రామాలల్లో అవగాహన పెంచాలి.

– రాము, బుసిరెడ్డిపల్లి

పక్కాగా పౌష్టికాహారం పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యం కోసం నెలనెలా కోడిగుడ్డు పంపిణీ చేస్తున్నాం. సరఫరాలో అక్రమాలు లేకుండా పంపిణీ చేసేందుకు మూడు రంగుల్లో మద్ర వేస్తున్నాం. ఈ నెలలో ముద్ర ఉన్న కోడిగుడ్లను అందిస్తాం. దీంతో లబ్ధిదారులకు పక్కగా పౌష్టికాహారం అందనుంది.

– లక్ష్మమ్మ, సీడీపీఓ

దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహిద్దాం

ఆత్మకూర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లను చేపడుతున్నామని, అధికారులందరూ సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రత్యేకాధికారి అనిల్‌ప్రకాష్‌కిరణ్, డీపీఓ సురేష్‌ అన్నారు. గురువారం మండలంలోని మూలమళ్ల, ఆరేపల్లి, జూరాల గ్రామాల్లోని రైతువేదికలను పరిశీలించారు. తహసీల్దార్‌ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నర్సింగ్‌రావుతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

అమరచింత: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రైతువేదికలను సిద్ధం చేస్తున్నామని, ఉత్సవంలో రైతులందరూ పాల్గొనేలా స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని డీపీఓ సురేష్‌కుమార్‌ అన్నారు. గ్రామాల్లో ప్రజలను ఒకే వేదికపై తీసుకురావాలని కలెక్టర్‌ ఆదేశాల మేరకు మండలంలోని రైతువేదికల్లో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లి, నాగల్‌కడ్మూర్, నందిమళ్ల గ్రామాల్లో గల రైతువేదికలను మండల అధికారులతో కలిసి గురువారం సందర్శించారు. రైతువేదికలలో సౌకర్యాలను కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. జూన్‌ 3న రైతు వేదికల వద్ద రైతులతో సంబురాలను నిర్వహించి, సామూహిక భోజనాలకు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఒక్కో రైతువేదిక వద్ద వెయ్యి మందికి భోజనాల వసతి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ చాంద్‌పాషా, ఏఓ వినయ్, ఏఈఓలు రాజేష్, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.



పాంరెడ్డిపల్లి రైతువేదిక వద్ద ఉపాధి కూలీలతో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న డీపీఓ సురేష్‌కుమార్

కొత్తకోట రూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఘనంగా నిర్వహించుకుందామని పెద్దమందడి తహసీల్దార్‌ సంధ్య అన్నారు. గురువారం తహసీల్దార్‌ కార్యాలయంలో వివిధ శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. శుక్రవారం ప్రతి గ్రామంలో జాతీయ జెండాను ఆవిష్కరించడంతో పాటు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, డప్పులతో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. 21రోజుల పాటు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయం ఉట్టిపడేలా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అఫ్జల్‌ ఉన్నారు.

పాన్‌గల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్‌ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ మండలంలో ఘనంగా నిర్వహించేలా అందరూ కృషి చేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతువేదికలను ఘనంగా అలంకరించాలన్నారు. ఈనెల 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలను తేదీల వారీగా నిర్వహించే కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. ఉత్సవాల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ చక్రపాణి, ఏఓ సాజీద్‌ రహమాన్, ఎంపీఓ రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: దశాబ్ది ఉత్సవాల్లో అందరూ పాల్గొనివిజయవంతం చేయాలని ఎంపీపీ ఆవుల శైలజ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ పద్మ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2వ తేదీ నుంచి 22తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు ప్రతి గ్రామంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని వివిధ కార్యక్రమాలు చేస్తూ విజయవంతం చేయాలని, అలాగే 3న తెలంగాణ రైతు దినోత్సవం ఏర్పాట్లపై చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కరుణశ్రీ, వైస్‌ చైర్మన్‌ కర్రెస్వామి, తహసీల్దార్‌ అబ్రహం, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



పెద్దమందడిలో తహసీల్దార్‌ సంధ్య



పెబ్బేరులో..



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

సేవా కార్యక్రమాలు అభినందనీయం

కొల్లాపూర్: ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేసేవారు అభినందనీయులని తహసీల్దార్‌ శివ శ్రీనివాస్‌ అన్నారు. వనిత గోల్డ్‌క్లబ్‌ ఆధ్వర్యంలో 42 రోజులుగా కొల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలికేంద్రం ముగింపు సందర్భంగా బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. తహసీల్దార్‌ భోజనాలు వడ్డించారు. వనిత గోల్డ్‌క్లబ్‌ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆకుతోట సుదర్శన్‌శెట్టి, శేషయ్యశెట్టి, లక్ష్మణశెట్టి, సాయిబాబా, శ్రీనివాసులు, రాము, శ్రీదేవీ, నిర్మల పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి

కొల్లాపూర్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్‌ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్‌ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. దేశానికి గౌరవ, ప్రతిష్టలు పెంచిన మహిళా రెజ్లర్లపై బ్రిజ్‌భూషణ్‌ అసభ్యకరంగా ప్రవర్తించారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరితే కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. శివ, నందు, శంకర్, కార్తీక్, రాజేష్‌ ఉన్నారు.

ప్రతిఒక్కరికీ గొర్రెలు పంపిణీ చేయాలి

కొల్లాపూర్: అర్హులైన ప్రతిఒక్కరికీ గొర్రెలను పంపిణీ చేయాలని కోరుతూ టీఎస్‌ఎస్‌జీడీసీ చైర్మన్‌ దూదిమెట్ల బాలరాజుయాదవ్‌కు కొల్లాపూర్‌ యాదవ సంఘం నాయకులు వినతి అందజేశారు. యాదవ యువజన సంఘం నాయకులు గంగం మల్లేష్‌యాదవ్‌ నేతృత్వంలో పలువురు బాలరాజుయాదవ్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. గొర్రెల యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకున్న గొల్ల, కురువలు అందరికీ గొర్రెలు పంపిణీ చేయాలని కోరినట్లు వెల్లడించారు.